# పొగాకు రహిత సమాజ స్థాపన సాధ్యమేనా !

## (31 మే "ప్రపంచ పొగాకు రహిత దినం" లేదా "ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం" సందర్భంగా)

సిగరెట్లు, బీడీలు, పైపులు, గుట్కాలు, నసెం పొడులు, జర్ధా, ఖైనీ, స్మోక్‌లెస్ టొబాకో లాంటి పలు రకాలైన పొగాకు ఉత్పత్తులు పలు ఆకర్షణీయ రూపాల్లో మనల్ని వశపరుచుకునే విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటికి తోడుగా పొగరాయుళ్లతో తిరిగే స్నేహితులు, బంధువులు కూడా సెకండ్ హాండ్ స్మోకర్స్‌గా తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. అవగాహనలేమి లేదా తెలిసి కూడా పొగాకు ఉత్పత్తుల వాడకంతో నిండు ప్రాణాలు ప్రమాదంలో పడడం, చివరికి వైద్య ఖర్చులకు కుటుంబాలు బజారున పడడం, ప్రాణాలు కూడా పోవడం చూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పొగాకు దురలవాటుతో సాలీనా 8.7 మిలియన్ల ప్రాణాలు పోతున్నాయని, అనేక మిలియన్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని గణాంక వివరాలు స్పష్టం చేస్తున్నాయి. పొగాకు రహిత సమాజ స్థాపన జరగాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కృషి చేయడం సముచితంగా ఉన్నది.

పొగాకు పరిశ్రమల అనైతిక ప్రచార విష వలయంలో పడొద్దు:

1988లో ఐరాస – డబ్ల్యూహెచ్ఓ చొరవతో పొగాకు దురలవాటు దుష్ప్రభావాలను సామాన్య ప్రజలకు అవగాహన పర్చడంలో పాటు ఆ ఉత్పత్తుల మాయ వలలో పడకుండా హెచ్చరించడానికి ప్రతి ఏట 31 మే రోజున "ప్రపంచ పొగాకు రహిత దినం (వరల్డ్ నో టొబాకో డే)" లేదా "ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం( ప్రపంచ ఆంటీ–టొబాకో డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ (పొగాకు కంపెనీల విజ్ఞప్తుల గుట్టు విప్పడం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పొగాకు ఉత్పత్తులను తయారు చేసే కంపెనీలు వాడే ప్రమాదకర సువాసనలను వెదజల్లే పదార్థాలను వాడడం, మార్కెటింగ్ విధానాల్లో అనైతిక పద్ధతులు వాడడం, ఆకర్షణీయ ప్యాకేజీలను వాడడం, ప్రముఖులతో ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, ప్రమాదకర ఇతర పదార్థాలను వాడడం లాంటి పోకడలను వ్యతిరేకించడం జరుగుతున్నది. పొగాకు పరిశ్రమలు గుప్పించే ప్రకటనల విషవలయంలో చిక్కి 37 మిలియన్ల 13 – 15 ఏండ్ల పిల్లలు కూడా సతమతం అవుతున్నారు. పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పరిశ్రమలు దాదాపు 16,000 రకాల సువాసన కలిగిన రసాయన పదార్థాలను కలుపుతున్నట్లు తెలుస్తున్నది.

భారతంలో పొగాకు ఉత్పత్తుల వాడకం – దుష్ప్రభావాలు:

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.3 బిలియన్ల ప్రజలు పొగాకు ఉత్పత్తుల దురలవాటుకు లోనైనారని, భారత్‌లో 15 ఏండ్ల పైబడిన 253 మిలియన్ల ప్రజలు (పురుషులు, మహిళలు) దురలవాటు గుప్పిట్లో చిక్కిపోయారని తెలుస్తున్నది. ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తులు వాడడంలో రెండవ స్థానంలో నిలుస్తున్న భారత్‌లో సెకండ్ హాండ్ స్మోకింగ్ కూడా అధికంగా ఉందని హెచ్చరిస్తున్నారు. పొగాకు దురలవాటు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే 80 శాతం వరకు ఉందని గమనించాలి.

భారత్‌లో అత్యంత ప్రమాదకర ప్రజారోగ్య సమస్యల్లో పొగాకు దురలవాటు 5వ స్థానాన్ని ఆక్రమించింది. పొగాకు దురలవాటుతో 18 శాతం హృద్రోగ మరణాలు, 14 శాతం స్ట్రోక్‌లతో మరణాలు, 60 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్స్ మరణాలు నమోదు అవుతున్నాయి. పొగాకు వాడినపుడు విడుదల చేయబడే పొగలో వేల కొద్ది రసాయనాలు, 70 వరకు ప్రమాదకర రసాయనాలు విడుదల అవుతున్నాయని తెలుసుకోవాలి. పొగాకు దురలవాటు దీర్ఘకాలం కొనసాగితే ఊపిరితిత్తులు, నోరు, గొంతు, కాలేయం, మూత్ర పిండాలు, క్లోమం, గర్భాశయ, పెద్ద ప్రేగు క్యాన్సర్లకు దారి తీయడంతో పాటు ప్రాణాలను సహితం కోల్పోవడం జరుగుతోంది. పొగాకు ఉత్పత్తుల వాడకంతో ఊపిరితిత్తులు, గుండె, మధుమేహం, టీబీ, కంటి జబ్బులు, స్ట్రోక్ లాంటి ప్రమాదకర వ్యాధులు కలుగుతాయని తెలుసుకోవాలి. గర్భవతులు పొగాకు వాడితే పిల్లల్లో తక్కువ బరువు, ముందస్తు ప్రసవాలు, శిశు అభివృద్ధి మందగించడం కూడా జరుగుతాయి. పొగాకులో ఉన్న నికోటిన్ ప్రభావంతో ప్రాణాంతక పరిస్థితులు వస్తాయి.

పొగాకు ఉత్పత్తుల దురలవాటును తగ్గించడానికి తగు నియమనిబంధనలు, ప్రమాదరక సువాసనలు ఇచ్చే పదార్థాల వినియోగాన్ని నిషేధించడం, నికోటిన్ ఉత్పత్తులను వాడకపోవడం లాంటి చర్యలను తీసుకోవాలని ప్రపంచ దేశాలకు డబ్ల్యూహెచ్ఓ సూచిస్తున్నది. పొగాకు ఉత్పత్తుల అనైతిక మార్కెటింగ్ సరళిని అడ్డుకోవడం, పన్నులను పెంచడం, పొగ రహిత వాతావరణాన్ని నెలకొల్పడం నిరంతరం జరగాలి. ప్రభుత్వాలు, విద్యావేత్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పౌర సమాజం సమైక్యంగా కలిసి పోరాడితే పొగాకు రహిత సమాజ స్థాపన సుసాధ్యమని తెలుసుకోవాలి. ఆరోగ్యంగా జీవించడం ఓ మానవ హక్కు అని తెలుసుకొని, పొగాకు దురలవాట్లకు దూరం, సంపూర్ణ ఆరోగ్యకర సమాజానికి దగ్గరగా జీవితాలను సుసంపన్నం చేసుకుందాం, పొగాకు రహిత సమాజాన్ని స్థాపించుకుందాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రైతుల పురోగతికి నూతన ద్వారాలను తెరుస్తుంది: ప్రధాని

న్యూఢిల్లీ, మే 30:ప్రధాన మంత్రి శ్రీ నరంద్ర మోదీ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వికసిత కృషి సంకల్ప్ అభియాన్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ వికసిత కృషి సంకల్ప్ అభియాన్ రైతులకు, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన ఒక ముఖ్యమైన కార్యక్రమమని అన్నారు. వర్షాకాలం దగ్గరపడుతున్న కొద్దీ, ఖరీఫ్ సీజన్ ఏర్పాట్లు చేయటం మొదలవుతున్న ప్రస్తుత తరుణంలో వచ్చే 12 నుంచి 15 రోజుల పాటు 2000 మంది శాస్త్రవేత్తలు, నిపుణులు, అధికారులు, ప్రగతిశీల రైతులతో కూడిన బృందాలు 700 లకు పైగా జిల్లాల్లో సందర్శించి లక్షల మంది రైతులను చేరుకుంటారని తెలిపారు. ఈ బృందాల్లో ఉన్న వారికి శుభాకాంక్షలు తెలిపిన ఆయన భారత వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు వారికి ఉన్న అంకితభావాన్ని ప్రశంసించారు.

వ్యవసాయం సాధారణంగా రాష్ట్రానికి సంబంధించిన అంశమని.. ప్రతి రాష్ట్రం రైతుల సంక్షేమం విధానాలను, కార్యక్రమాలను రూపొందించాయని.. వేగంగా మారుతోన్న ప్రస్తుత కాలానికి అనుగుణంగా భారత వ్యవసాయ రంగంలో మార్పు అవసరమని అన్నారు. భారత రైతులు రికార్డు స్థాయిలో ఉత్పత్తిని సాధించి ధాన్యం నిల్వలను పెంచుతున్నారని, అయితే మార్కెట్ పరిస్థితులు, వినియోగదారుల ప్రాధాన్యతలు మారుతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రాలు, రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయానికి సంబంధించి ఆధునిక సంస్కరణలు తీసుకురావడం అత్యవసరమని ప్రధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రీయ బృందాలు ప్రయోగశాల నుంచి వ్యవసాయ క్షేత్రాలకు తరలి రైతులకు సమగ్ర సమాచారాన్ని ఇచ్చి, వారికి అధునాతన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిస్తాయని ప్రధానంగా పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే ముందు రైతులకు సహాయం చేయడానికి ఈ బృందాలు సిద్ధంగా ఉంటాయని అన్నారు.

దశాబ్దాలుగా భారత వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధన విషయంలో సాధించిన గణనీయమైన పురోగతి తెలియజేస్తూ అవి చూపించిన సానుకూల ప్రభావాన్ని ప్రధానంగా తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త పద్ధతులను విజయవంతంగా ప్రయోగించి, అద్భుతమైన దిగుబడిని సాధించిన ప్రగతిశీల రైతులను ఆయన ప్రశంసించారు. శాస్త్రీయ పరిశోధన, విజయవంతమైన వ్యవసాయ పద్ధతులు విస్తృత వ్యవసాయ వర్గానికి చేరేలా చూసుకునే ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావిస్తూ.. వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ, వాటిని నూతన ఉత్తేజంతో వేగవంతం చేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. "ఈ జ్ఞానానికి సంబంధించిన అంతరాన్ని తగ్గించేందుకు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ఒక విలువైన అవకాశాన్ని అందిస్తోంది. ఇది రైతులకు అత్యాధునిక వ్యవసాయ పద్ధతుల నుంచి ప్రయోజనం చేకూరుస్తుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

వికసిత్ భారత్ కోసం భారతదేశ వ్యవసాయం కూడా అభివృద్ధి చెందాలని, వ్యవసాయ రంగాన్ని మార్చటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిన అనేక కీలక అంశాలను ప్రధానంగా తెలియజేశారు. రైతుల ఉత్పత్తులకు మంచి ధరలు అందేలా చూసుకోవటం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, జాతీయ అవసరాలకు అనుగుణంగా పంట ఉత్పత్తిని చేపట్టటం వంటి కీలక అంశాలను ఆయన వివరించారు. "భారత్ తన సొంత అవసరాలను తీర్చుకోవటమే కాకుండా ప్రపంచ ఆహార సరఫరాదారుగా కూడా ఎదగాలి" అని వ్యాఖ్యానించారు. వాతావరణ మార్పు సవాళ్లను ఎదుర్కోవడం, తక్కువ నీటి వినియోగంతో ధాన్యం ఉత్పత్తిని పెంచడం, హానికరమైన రసాయనాల నుంచి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవటం, వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ క్షేత్రాల్లో ఉపయోగించటం చాలా అవసరమని అన్నారు. గత 10–11 సంవత్సరాలుగా ప్రభుత్వం ఈ దిశగా విస్తృతమైన పనులు చేసిందని ప్రధానంగా చెప్పారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల విషయంలో పురోగతిపై రైతులకు అవగాహన పెంచాలని కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ఆయన విజ్ఞప్తి చేశారు.

సాధారణ వ్యవసాయం కాకుండా రైతులకు అదనపు ఆదాయం అందించే మార్గాలను చూపించే ప్రాముఖ్యతను ప్రధానంగా చెబుతూ.. రైతులకు ఈ దిశగా పలు అవకాశాలను కల్పించే లక్ష్యంగా పెట్టుకున్న కీలక కార్యక్రమాలను తెలియజేశారు. వ్యవసాయ క్షేత్రాల సరిహద్దుల వెంట సౌర ఫలకాలను ఏర్పాటు చేయడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుందని ఆయన తెలిపారు. తీపి విప్లవం(స్వీట్ రివల్యూషన్) ప్రభావాన్ని గుర్తించిన ఆయన తేనెటీగల పెంపకం రైతులకు ప్రయోజనం చేకూరుస్తోందని, ఎక్కువ మంది ఇందులోకి వచ్చేలా చూడాలని అన్నారు. వ్యవసాయ వ్యర్థాలను శక్తి వనరుగా మార్చడం, వ్యర్థాలను సంపదగా మార్చటం అవసరాన్ని కూడా ప్రధానమంత్రి ప్రధానంగా పేర్కొన్నారు. 'శ్రీ అన్న'ను పండించడానికి అనువైన ప్రాంతాలను గుర్తించడం, వ్యవసాయ ఉత్పత్తులలో విలువ జోడింపును పెంచే ప్రాముఖ్యతను కూడా ప్రధానంగా చెప్పారు. పాలు ఇవ్వని పశువులు కూడా గోబర్ధన్ యోజన ద్వారా ఇప్పుడు ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్నాయని, ఇది ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. ఎక్కువ మంది భాగస్వాములయ్యేలా, ప్రయోజనం పొందేలా ఈ ఆవిష్కరణల గురించి రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

ఈ మిషన్‌కు ఉన్న ప్రాముఖ్యతను ప్రధానంగా చెబుతూ "దేశ వ్యవసాయం అభివృద్ధి చెందిన భారత్‌కు మూలస్తంభంగా మారాలి" అని వ్యాఖ్యానించారు. తమ వద్దకు వచ్చే శాస్త్రవేత్తలతో చురుకుగా మాట్లాడి, ప్రశ్నలు అడిగి విలువైన వివరాలు తెలుసుకోవాలని రైతులను ఆయన కోరారు. శాస్త్రవేత్తలు, అధికారులు ఈ మిషన్ ప్రాముఖ్యతను గుర్తించాలని విన్నవించారు. వారి నిబద్ధత సాధారణంగా చేసే ప్రభుత్వ పనికి మించి జాతీయ సేవా స్ఫూర్తిని ప్రతిబింబించాలని అన్నారు. రైతుల సందేహాలకు సమగ్రంగా స్పందించాలని, వారి విలువైన సూచనలను కూడా నమోదు చేసుకోవాలని వారిని కోరారు. "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ దేశ రైతులకు పురోగతికి కొత్త ద్వారాలను తెరుస్తుంది. వ్యవసాయంలో ఆధునికీకరణను ప్రోత్సహిస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలోని అందరు భాగస్వాములకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగాన్ని ముగించారు.

## ఆర్థిక వృద్ధిలో మంద గమనం..

## గణాంకాలు విడుదల చేసిన కేంద్రం

ముంబయి, మే 30: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం కొంత మందగించింది. శుక్రవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరమైన 2023–24లో నమోదైన 9.2 శాతం వృద్ధితో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదల అని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) వెల్లడించింది.

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉండవచ్చని ఎన్ఎస్ఓ తన రెండో ముందస్తు అంచనాల్లో పేర్కొంది. ప్రస్తుతం విడుదలైన గణాంకాలు ఆ అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. కొవిడ్ మహమ్మారి సంక్షోభం తదనంతరం ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకున్న తర్వాత, వృద్ధి రేటు ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

# ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే వివేక్



ఆదిలాబాద్, మే 30:చెన్నూరు పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకే పట్టణంలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలో రూ.13లక్షల నిధులతో నిర్మించిన బస్తీ దవాఖానను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను ఎన్నికైన మొదటి నుంచి ప్రజలకు వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల వైద్య బృందాలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు సూచనలు ఇవ్వాలని, సీజన్ వ్యాధులు ప్రభలకుండా తగు చర్యలు తీసుకుంటూ వైద్య సేవలకు వచ్చిన రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ మెరుగైన సేవలు అందివాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సత్యనారాయణ, సిబ్బంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు గడువులోగా అనుమతులివ్వాలి : కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు, మే 30: పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువు లోపుగా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు సంబంధించి 9 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వీటికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఈఈ ని ఆదేశించారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయని కలెక్టర్ ఆరా తీశారు. ల్యాండ్ లెవెలింగ్, ముళ్ళ పొదల తొలగింపు పూర్తయిందని, సోమవారం మెటీరియల్ వస్తోందని ఏపీఎంఐపీ పిడి కలెక్టర్ కు వివరించారు. ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు దేవనకొండ మండలం ఈదుల దేవర బండ గ్రామంలో 10 ఎకరాలను కేటాయించడం జరిగిందని, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇందులో ఎంఎస్, ఎంఈ పార్కు ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఇందుకు సంబంధించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు. బనవాసి టెక్స్ టైల్ పార్కు లో త్వరితగతిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు. అలాగే మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటునకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జీఎంను ఆదేశించారు.

పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 24 క్లెయిమ్ లకు రూ.1.61 కోట్లకు ఆమోదం తెలపడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ క్రింద 17 క్లెయిమ్స్ కు రూ. 1,57,50,166లు, వడ్డీ రాయితీ కింద ఒక క్లెయిమ్ కు రూ. 13,813లు, విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ క్రింద ఒక క్లెయిమ్ కు సంబంధించి రూ 36,663లు, సేల్స్ టాక్స్ రీయింబర్స్‌మెంట్ క్రింద 5 క్లెయిమ్స్ కు సంబంధించి రూ.3, 35,265లు పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కేటగిరీల వారీగా జనరల్ కేటగిరీలకు 7, ఎస్సీ లకు 15, ఎస్ టి లకు 2 మొత్తంగా 24 మందికి ప్రోత్సాహకాలు మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్చార్జి జిఎం అరుణ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఏపీ ఎంఐపీ పిడి ఉమా దేవి,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాసర అమ్మవారి సన్నిధికి పోటెత్తిన భక్తజనం



బాసర, మే 30 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం పర్వదినం కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారి సన్నిధిలోని అక్షరాభ్యాస మండపాల్లో ఆలయ అర్చకులచే తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలను జరిపించారు.

మధ్యాహ్నం భక్తుల సంఖ్య పెరగడంతో దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది. పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. సుమారు పదివేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అక్షరాభ్యాస పూజలు, ప్రసాదాలు, ఇతర అమ్మకాల ద్వారా ఆలయానికి 10 లక్షల రూపాయల ఆదాయం సమకూరనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

## –బిఆర్ఎస్ గా మారిన టిఆర్ఎస్ కు ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారు

## –బిజెపి ఎంపి రఘునందన్ రావు

హైదరాబాద్ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): : బిఆర్ఎస్ కు పోటీ చేయడానికి కనీసం అభ్యర్థులు లేరని బిజెపి ఎంపి రఘునందన్ రావు చురకలంటించారు. బిఆర్ఎస్ గా మారిన టిఆర్ఎస్ కు ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు ) బిజెపికి దగ్గర వుతున్నారని, బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. జనం గుండె చప్పుడుగా బిజెపి మారిందని పేర్కొన్నారు. తనపై వ్యక్తిగతంగా బురద జల్లేందుకు యత్నిస్తున్నారని, దొంగే దొంగా దొంగా అని అరిచినట్లుందని బిఆర్ఎస్ తీరు అని విమర్శించారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఎక్కడా లేదని, బిఆర్ఎస్ చెల్లని రూపాయని అన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్ప డుతున్న పెయిడ్ బ్యాచ్ లపై కేసులు నమోదు చేయాలని సూచిం చారు. పెయిడ్ ఆర్టిస్టులతో పోస్టులు పెట్టిస్తున్నారని, ఎమ్మెల్యే కవిత కూడా ఆరోపించారని చెప్పారు.

# అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2026 మార్చి 31 వరకు ఈ నిల్వ సరుకు పరిమితి వర్తింపు

న్యూఢిల్లీ, మే 30:సమగ్ర ఆహార భద్రత నిర్వహణతో పాటు దొంగ నిల్వలు, అన్యాయానికి వెనుకాడని సట్టావ్యాపారం.. ఈ రెండిటికీ అడ్డుకట్ట వేయడానికి వ్యాపారులు, టోకు, చిల్లర వ్యాపారులు, చిల్లర విక్రయ రంగంలోని బడా సంస్థలు (బిగ్ చైన్ రిటైలర్స్), ఆహార శుద్ధి సంస్థలకు గోధుమ నిల్వ సరుకుకు సంబంధించి భారత ప్రభుత్వం పరిమితులను విధించింది. లైసెన్సింగ్ ఆవశ్యకతల, నిల్వ సరుకుకు పరిమితుల తొలగింపు, నిర్దిష్ట ఆహార పదార్థాల రవాణా (సవరణ) ఉత్తర్వు–2025ను గత మంగళవారం (అంటే 2025 మే 27న) జారీ చేశారు. ఈ ఉత్తర్వు అన్ని రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2026 మార్చి 31 వరకు వర్తిస్తుంది.

గోధుమల నిల్వ సరుకు పరిమితులు ఈ కింది విధంగా ఉన్నాయి:

–వ్యాపారులు, టోకు వ్యాపారులకు: 3000 ఎంటీ

–చిల్లర విక్రేతకు: ప్రతి చిల్లర విక్రయ దుకాణానికీ 10 ఎంటీ చొప్పున.

– చిల్లర విక్రయరంగంలోని బడా సంస్థకు: ప్రతి చిల్లర విక్రయ దుకాణానికి 10 ఎంటీ వరకు. అయితే ఇది గరిష్ఠ నిల్వ పరంగా చూసినప్పుడు (దుకాణాల మొత్తం సంఖ్యను 10తో గుణించగా వచ్చే) ఎంటీగా ఉంటుంది. ఇది ఆయా సంస్థల అన్ని రిటైల్ అవుట్‌లెట్లు, డిపోలు కలుపుకొంటే అట్టిపెట్టుకో దగిన గరిష్ఠ నిల్వ అవుతుంది.

శుద్ధి సంస్థలకు: నెలవారీ స్థాపిత సామర్థ్యం (ఎంఐసీ)లో 70 శాతాన్ని 2025–26 ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న నెలలతో గుణించాలి.

గోధుమ నిలవ సరుకును పెట్టుకొనే సంస్థలన్నీ ప్రతి శుక్రవారం నిల్వ సరుకు స్థితిని ప్రకటించడమో, సదరు సమాచారాన్ని తాజాపరచడమో చేయాలి. ఈ పనిని గోధుమల స్టాక్ పోర్టల్ (https://evegoils.nic.in/wsp/login) లో పూర్తి చేయాలి. గోధుమల స్టాక్ పోర్టల్‌ను త్వరలో https://foodstock.dfpd.gov.in లో చేర్చనున్నారు. ఏ సంస్థ అయినా పోర్టల్‌లో నమోదు కాకున్నా, లేదా నిల్వ సరుకు పరిమితులను అతిక్రమించినా ఆ సంస్థ నిత్యావసర వస్తువుల చట్టం–1955 లోని 6, 7 సెక్షన్లలో భాగంగా తగిన శిక్ష తీసుకుంటారు.

పైన ప్రస్తావనకు వచ్చిన సంస్థల వద్ద ఉన్న నిల్వ సరుకు నిర్దేశిత పరిమితికి మించిపోయినట్లయితే, అవే నిర్దిష్ట నిల్వ సరుకు పరిమితులను వారు నోటిఫికేషన్ జారీ అయిన 15 రోజుల్లో చూపించాలి. దేశంలో గోధుమలకు ఎలాంటి కృత్రిమ కొరతా రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకొనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు ఈ నిల్వ సరుకు పరిమితుల అమలును నిశితంగా పర్యవేక్షించనున్నారు.

పీడీఎస్, ఓడబ్ల్యూఎస్‌లతో పాటు మార్కెట్లో జోక్యం చేసుకొనేందుకు ఉద్దేశించిన ఇతర పథకాల కోసం అవసరంపడేటంత నిల్వలను కలిగి ఉండడానికి ఎఫ్‌సీఐ, రాష్ట్రాల ఏజెన్సీల ద్వారా 298.17 ఎంటీ గోధుమలను (ఈ నెల 27 వరకు) కేంద్ర ప్రభుత్వం సేకరించింది. ధరలను నియంత్రిస్తూ ఉండటంతో పాటుగా దేశంలో గోధుమల లభ్యత సులభసాధ్యమయ్యేటట్టు చూసే ఉద్దేశంతో ఆహార, ప్రజా పంపిణీ విభాగం గోధుమ నిల్వ సరుకు స్థితిని శ్రద్ధగా గమనిస్తోంది.



# ఆరు శాసనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి : చంద్రబాబు



న్యూఢిల్లీ, మే 30:మహానాడులో ప్రవేశపెట్టిన 'నా తెలుగు కుటుంబం'లోని ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు టీడీపీ అధినేత చంద్రబాబు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నామన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా నిర్ణయాలపై ప్రజల్లో సానుకూలత ఉందని తెలిపారు. ప్రజలకు ఏడాది పాలనలో ఏం చేశామో.. రాబోయే రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించామన్నారు. ప్రజలతో నాయకులు మరింత మమేకమవ్వడం ద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చించేలా చూడాలని సూచనలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన నేడు పార్టీ ముఖ్య నేతలతో, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

కడప మహానాడు అద్భుతంగా జరిగిందని.. జిల్లా నాయకత్వమంతా కలిసి పనిచేసి విజయవంతం చేశారన్నారు. సక్సెస్ చేసిన నేతలకు అభినందనలు, కార్యకర్తలకు హ్యాట్సాఫ్ తెలిపారు సీఎం. నాయకత్వం సమిష్టిగా పనిచేస్తే ఏ కార్యక్రమమైనా సజావుగా జరుగుతుందని కడప మహానాడుతో నిరూపితమైందన్నారు. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. మహానాడుకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రావడం సంతోషాన్నిచ్చింది.

కాగా, తాను ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి కారణం ప్రజలతో మమేకం కావాలని నిర్ణయించుకోవడమేనని అన్నారు చంద్రబాబు. ఎమ్మెల్యేలు కూడా విధిగా పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. జూన్ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత పథకాలు ప్రారంభిస్తామని.. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా సంక్షేమ కేలండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

రేపు కోనసీమ జిల్లాలో పర్యటన..

మరోవైపు కోనసీమ జిల్లాలో రేపు సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం 12:50 గంటలకు ముమ్మిడివరం మండలం సి.హెచ్. గున్నేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో సీఎం దిగనున్నారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు కాట్రేనికోన మండలం చెయ్యేరులో ఉపాధి హామీ పథకంలో పూడికతీత తీసే ఉపాధి కూలీలతో మాటామంతి నిర్వహిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అర్హులకు పింఛన్ పంపిణీ చేయనున్నారు. అదే గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్తులతో సమావేశం కానున్నారు ముఖ్యమంత్రి.

అక్కడే జిల్లాకు సంబంధించి పేదల సేవలో బంగారు కుటుంబ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం సిహెచ్ గున్నేపల్లి గ్రామంలో 3:35 గంటలకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో పాల్గొననున్నారు. 5:15 గంటలకు గున్నేపల్లి హెలిప్యాడ్ నుంచి తిరిగి ప్రయాణం కానున్నారు. జిల్లాలో సుమారు ఐదు గంటల పాటు సీఎం పర్యటన జరగనుంది.

# ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఉగ్రవాదంపై భారత సమర్ధ చర్యల్లో నారీశక్తిది కీలక పాత్ర: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, మే 30:"ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్, పీవోకేలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకున్న సమర్థమైన చర్యల్లో మహిళా పైలట్లు, ఇతర మహిళా సైనికులు కీలక పాత్ర పోషించారు" అని రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మే 29న గోవాలో జరిగిన ఐఎన్ఎస్వీ తారిణి పతాకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాయుధ దళాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పటి నుంచి ప్రతి పాత్రలోనూ వారు అద్భుత ప్రదర్శన కనబరిచారని, ప్రతి బాధ్యతనూ సంపూర్ణంగా నెరవేర్చారని రక్షణ మంత్రి పునరుద్ఘాటించారు.

"సియాచిన్ శిఖరాల నుంచి సముద్ర అగాధాల వరకు భారతీయ మహిళలు అనేక బాధ్యతలను నెరవేరుస్తున్నారు. ఇది దేశ భద్రత వలయాన్ని మరింత బలోపేతం చేస్తోంది. సైనిక పాఠశాలల ద్వారాలు నేడు బాలికల కోసమూ తెరుచుకుంటున్నాయి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుంచి ఈ నెలలో 17 మంది మహిళలు బయటికొస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సాయుధ దళాల్లోని అన్ని శాఖల్లోనూ మహిళలు క్రియాశీలకంగా, సమర్థంగా పాలుపంచుకున్నారు" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

'నావికా సాగర్ పరిక్రమ–2ను విజయవంతంగా పూర్తిచేసుకుని తిరిగొచ్చిన భారత నావికా దళాధికారులైన ధీర వనితలు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప.ఎ ను రక్షణ మంత్రి అభినందించారు. ఈ చరిత్రాత్మక యాత్రను పూర్తిచేసుకుని ప్రపంచాన్ని చుట్టివచ్చిన వారి ధైర్యం, అంకితభావం, సహనశీలతను ఆయన ప్రశంసించారు. వారి సాగరయానాన్ని నారీ శక్తికి ప్రతిరూపంగా ఆయన అభివర్ణించారు.

ఈ సాహసయాత్ర రెండో ఎడిషన్‌లో వీరిద్దరూ భారత్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి ద్వయంగా వీరు నిలిచారు. ఈ అధికారులిద్దరూ ఎనిమిది నెలల కాలంలో 25,600 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించారు. ఈ మొత్తం ప్రయాణంలో ఫ్రీమాంటిల్ (ఆస్ట్రేలియా), లిటెల్టన్ (న్యూజిలాండ్), పోర్ట్ స్టాన్లీ (ఫాక్లాండ్ దీవులు), కేప్ టౌన్ (దక్షిణాఫ్రికా) నౌకాశ్రయాల వద్ద వారు ఆగారు.

భౌతిక, మానసిక అవరోధాలను ఎదుర్కొని, శక్తియుక్తులతో వాటిని అధిగమించి, తాము భారత వీరపుత్రికలమని ప్రపంచానికి చాటారంటూ రాజ్‌నాథ్ సింగ్ వారిని ప్రశంసించారు. ఎనిమిది నెలల సుదీర్ఘ సాగరయానంలో ఒంటరితనాన్ని విజయవంతంగా ఎదుర్కొన్న మహిళా అధికారుల మానసిక స్థైర్యాన్ని కొనియాడారు. ఈ లెఫ్టినెంట్ కమాండర్లిద్దరూ సాధించిన ఘనత అందరికీ సాధ్యం కాదని, వారి ధైర్యసాహసాలు, సంకల్పం, బలాన్ని ఇది తెలియజేస్తుందని వ్యాఖ్యానించారు.

పలు నౌకాశ్రయాల్లో ఆగిన సందర్భంగా స్థానికులు, భారతీయ ప్రవాసులు వీరిద్దరికీ ఘనస్వాగతం పలికారు. త్రివర్ణ పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడించడం ద్వారా ఈ ఇద్దరు మహిళా అధికారులూ దేశం గర్వించేలా చేశారని రక్షణ మంత్రి అన్నారు.

"ఈ గొప్ప ప్రయాణాన్ని పూర్తి చేసిన స్ఫూర్తితోనే ఆ అనుభవాలను మీరు నమోదు చేయాలి. మీకు ఎదురైన చేదు అనుభవాలనూ మధురానుభూతులనూ, నేర్చుకున్న విషయాలనూ అన్నింటినీ రికార్డు చేయండి. అవి భావి తరానికి, ముఖ్యంగా మన యువతులకు స్ఫూర్తినిస్తాయి" అని ఈ ధీరవనితలకు రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

పతాకావిష్కరణకు కొన్ని రోజుల ముందు మహిళా అధికారులతో తన వర్చువల్ సంభాషణను గుర్తుచేసుకున్న రక్షణ మంత్రి.. ఆ సంభాషణ తనలో భావోద్వేగాలను నింపిందని చెప్పారు. ఇది దేశానికి గర్వకారణమన్న ఆయన.. గోవాలో స్వాగత కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్నిచ్చిందన్నారు.

విభిన్నమైన సవాళ్లను అధిగమించడంలో భారత నావికాదళం ధైర్యసాహసాలకు, పరిస్థితులను సానుకూలం చేసుకునే తీరుకు ఈ యాత్ర నిదర్శనమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. యాత్రకు సహకరించిన సిబ్బందిని అభినందించారు. నావికా సాగర్ పరిక్రమ–ఎఎ విజయవంతంగా పూర్తవడానికి దోహదపడిన శిక్షకులు, సాంకేతిక బృందం, నావికాదళ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కే త్రిపాఠి తన ప్రసంగంలో ఈ ఇద్దరి అసాధారణ ధైర్యసాహసాలు, పట్టుదల, అచంచలమైన స్ఫూర్తిని కొనియాడారు. అద్భుతమైన మన సముద్ర ఘనతను చాటేలా, సాగర చైతన్యాన్ని పెంపొందించే దిశగా ఈ ప్రయాణం ముఖ్యమైన ముందడుగు అన్నారు. నారీశక్తికి నిదర్శనంగా నిలిచే వీరి గాథ ప్రతి భారతీయుడికీ స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా 'బ్రేకింగ్ వేవ్స్, మేకింగ్ హిస్టరీ' శీర్షికతో ప్రపంచాన్ని చుట్టివచ్చిన ఈ అద్భుత యాత్రను వివరించే ఫోటో ఎస్సే బుక్‌ను విడుదల చేశారు. అద్భుతమైన ఈ సాగరయానాన్ని వివరించేలా ఈ ఎస్సేబుక్‌ను రూపొందించారు. సజీవమైన ఛాయాచిత్రాలు, సముద్ర జీవుల వివరాలను ఇందులో పొందుపరిచారు. సముద్ర సాహస కృత్యాలు, సాగరయాన పరిశోధనను ప్రత్యేకమైన దృష్టితో ఇది అందిస్తుంది. ప్రతిభను పెంపొందించడంలో, సాహస కృత్యాలను ప్రోత్సహించడంలో భారత నావికాదళ నిబద్ధతకు నావికా సాగర్ పరిక్రమ–2 నిదర్శనం. సముద్ర అన్వేషణలో భారత స్వావలంబనను ఇది ప్రతిబింబిస్తుంది. 2024 అక్టోబరు 2న గోవాలోని ఐఎన్ఎస్–మాండోవి నుంచి నావికా దళాధిపతి ఈ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర మొదటి ఎడిషన్‌ను 2017–18లో ఆరుగురు మహిళా సభ్యులతో కూడిన బృందం పూర్తి చేసింది.

గోవా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి కాండవెలో, సాయుధ దళాల వైద్య సేవల డైరెక్టర్ జనరల్ వైస్ అడ్మిరల్ ఆర్తి సరిన్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, సదరన్ నావల్ కమాండ్ వైస్ అడ్మిరల్ వి. శ్రీనివాస్, ఇతర సీనియర్ నౌకాదళ అధికారులు, కమాండర్ అభిలాష్ టోమీ (విశ్రాంత), లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా. కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప కుటుంబాలు ఈ కార్యక్రమానికి హాజరయ్యాయి.

# తిరుమలలో వేసవి రద్దీ .. గత నాలుగు రోజులుగా శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం

**-రోజు రోజుకి పెరుగుతున్న భక్తుల రద్దీ**
**-అన్ని కంపార్ట్ మెంట్లలలోనూ కిటకిట**
**-ఏటీసీ, టీబీసీ, ఏటీజీహెచ్, కృష్ణతేజ అతిథిగృహం,**
**-రింగురోడ్డు మీదుగా శిలాతోరణం వరకు భక్తుల క్యూలైన్**
**-మేనేజ్మెంట్ పై దృష్టి పెట్టిన టిటిడి**
**-సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ నియంత్రణ**
**-దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు అక్కడే అన్నప్రసాదాలు**
**-కంపార్టమెంట్ లలోనే 15 చోట్ల ఫుడ్ స్టాల్స్ ?**
**-చిన్నారులకు, వృద్ధులకు, పాలు, టీ అందజేత**

తిరుపతి, మే 30:తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. గత నాలుగు రోజులుగా దర్శనానికి 24 గంటల సమయ పడుతోంది. వేసవి సెలవులు ముగుస్తుండటం తో భక్తులు శ్రీవారి దర్శనం కోసం తరలి వస్తున్నారు. భక్తుల రద్దీ కి అనుగుణంగా టీటీడీ నిర్ణయాలు తీసుకుంటోంది. దర్శనం లో సాంకేతికత వినియోగించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. అలిపిరి వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు పై కసరత్తు జరుగుతోంది. ఇదే సమయంలో క్యూ లైన్ల నిర్వహణలో మార్పులు తెచ్చింది. తాజాగా టికెట్ కౌంటర్ల నిర్వహణలోనూ నిర్ణయాలు తీసుకుంది. కొనసాగుతున్న రద్దీ తిరుమలకు భారీగా భక్తులు తరలి వస్తున్నారు. వారాంతంలో 90 వేలకు పైగా, మిగిలిన రోజుల్లో 70,000 నుంచి 80,000 మంది శ్రీవారిని దర్శించుకుంటున్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా టీటీడీ నిర్ణయాలు తీసుకుంటోంది.

గతంలో సరైన లెక్కింపు లేకుండానే కంపార్ట్‌మెంట్‌కు ఇంతమంది అని ఉజ్జాయింపుగా లెక్కించేవారు. ఇప్పుడు టీటీడీ తిరుమలలో భక్తుల క్యూ లైన్ మేనేజ్మెంట్ సిస్టమ్‌పై దృష్టి సారించింది. దర్శనానికి వచ్చే ప్రతి ఒక్కరినీ లెక్కేసి, క్యూలో ఎంతమంది ఉన్నారో తెలుసుకొని భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో భక్తులు ఎక్కువగా ఎక్కడ ఉన్నారు, ఎక్కడ ఖాళీ ఉందనే వివరాలను ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. కీలక చర్యలు అందులో భాగంగా రద్దీ ప్రాంతం నుంచి ఖాళీ ఉన్నచోటుకు భక్తులను పంపి తోపులాట చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు.



కంపార్ట్‌మెంట్లలోకి నిర్ణీత సంఖ్యలో మాత్రమే భక్తులను అనుమతిస్తున్నారు. అదే విధంగా ఎప్పటికప్పుడు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండి ఏటీసీ, టీబీసీ, ఏటీజీహెచ్, కృష్ణతేజ అతిథిగృహం, రింగురోడ్డు మీదుగా శిలాతోరణం వరకు వేచి ఉండే భక్తులకు ఎప్పటికప్పుడు అన్నప్రసాదాలు అందిస్తున్నారు. ఇందుకోసం క్యూలైన్‌కు ఆనుకొని 15 చోట్ల కొత్తగా ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు అన్నప్రసాదాలు పంపుతూ ఎప్పుడు, ఎంత సరఫరా చేశారో ఆ వివరాలు నమోదు చేస్తున్నారు.

# స్వాతంత్ర్యవీర్ వినాయక్ దామోదర్ సావర్కర్‌కు పుష్పాంజలి ఘటించిన పార్లమెంటు సభ్యులు

న్యూఢిల్లీ, మే 30:స్వాతంత్ర్యవీర్ వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి సందర్భంగా లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జె పి నడ్డా, రాజ్యసభ ఉపాధ్యక్షులు శ్రీ హరివంశ్ ఈరోజు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఆ మహనీయుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

పార్లమెంటు సభ్యులు, పార్లమెంటు మాజీ సభ్యులు, లోక్‌సభ సెక్రటరీ జనరల్ శ్రీ ఉత్పల్ కుమార్ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ శ్రీ పి.సి. మోదీ, ఇతర సీనియర్ అధికారులు సైతం స్వాతంత్ర్యవీర్ వినాయక్ దామోదర్ సావర్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

వీర్ వర్కర్‌గా ప్రసిద్ధి చెందిన స్వాతంత్ర్య వీర్ వినాయక్ దామోదర్ సావర్కర్ 1883, మే 28న జన్మించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహోన్నత వ్యక్తి, ఉద్యమకారులు, కవి, రచయిత, దార్శనిక సామాజిక సంస్కర్త కూడా. 20వ శతాబ్ద ప్రారంభంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన స్ఫూర్తిని రగిలించడంలో వీర్ సావర్కర్ కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యం కోసం భారత యువతను ఏకం చేయడం, సమీకరించడం లక్ష్యంగా విప్లవ సంస్థలను స్థాపించారు. అండమాన్–నికోబార్ దీవుల్లోని సెల్యులార్ జైలులో ఆయన జైలు శిక్ష అనుభవించిన సమయంలో అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శిస్తూ, అచంచలమైన సంకల్పంతో అక్కడ అనేక కష్టాలను భరించారు.

తన విప్లవాత్మక భావజాలానికి మించి, వీర్ సావర్కర్ సామాజిక సంస్కరణలు, ఆధునీకరణకు గట్టి మద్దతుదారులు. హేతువాదం, సామాజిక దురాచారాలను నిర్మూలించడం, ప్రగతిశీల భారతీయ సమాజాన్ని పెంపొందించడం వంటి ఆదర్శాలను ఆయన సమర్థించారు. వీర్ సావర్కర్ రచనలు, జాతీయ స్వేచ్ఛ కోసం ఆయన అవిశ్రాంత కృషి, బలమైన, స్వావలంబన గల భారత్ పట్ల తన దార్శనికత ద్వారా ఆయన వారసత్వం కొనసాగుతున్నది. ఆయన జీవితం– దేశభక్తి, ఎటువంటి పరిస్థితులనైనా ఎదిరించగల సామర్థ్యం, సంస్కరణల కోసం శక్తిమంతమైన నిదర్శనంగా మిగిలిపోయింది.

సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఉంచిన స్వాతంత్ర్యవీర్ వి.డి. సావర్కర్ చిత్రపటాన్ని శ్రీమతి చంద్రకళ కుమార్ కదమ్ చిత్రించారు. 2003, ఫిబ్రవరి 26న అప్పటి భారత రాష్ట్రపతి డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం అధికారికంగా ఈ మహనీయుని చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

# జాతీయ అనుభవ్ అవార్డుల పథకం- 2025 కింద 2025 అగస్టు 18న అనుభవ్ అవార్డులను ప్రదానం

న్యూఢిల్లీ, మే 30:భారత ప్రధానమంత్రి ఆదేశాల మేరకు పదవీ విరమణ చేస్తోన్న, చేసిన ఉద్యోగులు వారి ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకునేందుకు పింఛన్లు, పింఛనుదారుల సంక్షేమ శాఖ 2015లో అనుభవ్ అనే ఆన్‌లైన్ వేదికను ప్రారంభించింది.

ఆ తర్వాత పదవీ విరమణ చేస్తోన్న, చేసిన ఉద్యోగులు తమ అనుభవాలను సమర్పించేలా ప్రోత్సహించేందుకు వార్షిక అవార్డుల పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు 59 అనుభవ్ అవార్డులు, 19 జ్యూరీ ధ్రువపత్రాలను ప్రదానం చేశారు.

2025కు సంబంధించిన ప్రకటించిన జాతీయ అనుభవ్ అవార్డుల పథకానికి ఒక ప్రత్యేకత ఉంది. మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈ), ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ఉద్యోగులు కూడా దేశ నిర్మాణంలో వారి తోడ్పాటును గుర్తించే ఈ పథకంలో పాల్గొన్నారు. 2024 జనవరి 04 నుంచి 2025 మార్చి 31 వరకు ప్రచురించిన ఉద్యోగుల అనుభవాలను ప్రస్తుత అవార్డులకు పరిగణనలోకి తీసుకున్నారు.

'అనుభవ్ కలయిక కార్యక్రమం' నిశిత పర్యవేక్షణలో రికార్డు స్థాయిలో 42 మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి మొత్తం 1459 రైటప్‌లు ప్రచురితమయ్యాయి. 2023లో 30 మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి మాత్రమే అనుభవాలు ప్రచురితమయ్యాయి.

ప్రచురితమైన ఈ అనుభవాల తర్వాత తగిన ప్రక్రియను అనుసరించి రెండు స్థాయిలలో పరీక్షించారు. తద్వారా 05 మంది అనుభవ్ అవార్డు గ్రహీతలు, 10 మంది జ్యూరీ ధ్రువపత్రాల విజేతలను ఖరారు చేశారు. అనుభవ్ అవార్డు గ్రహీతలలో.. భూ వనరుల శాఖ అదనపు కార్యదర్శి శ్రీ హుకుం సింగ్ మీనా, ఎస్‌బీఐ సీజీఎం శ్రీమతి షాలిని కాకర్, ప్రధానమంత్రి కార్యాలయం సహాయ మంత్రి ఓఎస్‌డీ శ్రీ ఎం. వెంకటేషన్, సీనియర్ పోస్టాఫీసుల సీనియర్ సూపరింటెండెంట్ శ్రీ ఓ. విరూపాక్షప్ప, సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీ సాజు పీ.కే ఉన్నారు.

జ్యూరీ ధ్రువపత్రాల కోసం ఎంపికైన వారిలో బీహెచ్ఈఎల్ డైరెక్టర్ శ్రీ జై ప్రకాష్ శ్రీవాస్తవ, డీఆర్‌డీఓ శాస్త్రవేత్త శ్రీ వినోద్ పీ, అంతరిక్ష శాఖ అత్యుత్తమ శాస్త్రవేత్త డాక్టర్ జాలీ ధర్, డీఓటి స్పెషల్ డీజీ శ్రీ సునీత చెరోదత్, డీఆర్‌డీఓ శాస్త్రవేత్త శ్రీ సాబు సెబాస్టియన్ ఎం, జల శక్తి డిప్యూటీ డైరెక్టర్ శ్రీ వెలగ కుమారి, ఐటీబీపీ హెడ్ కానిస్టేబుల్ జీడీ శ్రీ సంతోష్ గాల్వి, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ శ్రీ బాలం సింగ్ రావత్, సీఆర్‌పీఎఫ్ ఇన్స్పెక్టర్,ఫార్మసిస్ట్ శ్రీ ఎన్. మీనాక్షి సుందరం.. సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ, జీడీ శ్రీ షీలా రాణి పోద్దార్ ఉన్నారు.

అనుభవ్ అవార్డులు, జ్యూరీ ధ్రువపత్రాలను 2025 అగస్టు 18న జాతీయ స్థాయి కార్యక్రమంలో సహాయ మంత్రి (పీపీ) డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రదానం చేయనున్నారు.

# మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌లలో భారతీయ రైల్వేల మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, మే 30:రైలు మార్గ సామర్థ్యాన్ని పెంచడం కోసం, భారతీయ రైల్వేల్లో రెండు బహుళ ట్రాకుల ప్రాజెక్టుల అమలుకు ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సీసీఈఏ) ఈ రోజు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సీసీఈఏ సమావేశానికి అధ్యక్షత వహించారు.

బహుళ విధ సంధానానికి దన్నుగా నిలుస్తున్న పీఎమ్– గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లానుతో ఈ ప్రాజెక్టులు తెర మీదకు వచ్చాయి. వీటి వెనుక సమగ్రమైన ప్రణాళిక రచన కీలక పాత్రను పోషించింది. ప్రజల రాకపోకలకు, సరుకుల రవాణాకు, సేవల అందజేతకు అంతరాయం ఎదురవని సంధాన సదుపాయాన్ని ఈ ప్రాజెక్టులు సమకూర్చనున్నాయి.

మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలలోని నాలుగు జిల్లాల్లో విస్తరించివుండే ఈ రెండు ప్రాజెక్టులూ భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్కును సుమారు 176 కిలోమీటర్ల మేరకు పెంచనున్నాయి.

ప్రతిపాదిత మల్టి–ట్రాకింగ్ ప్రాజెక్టు దాదాపుగా 784 గ్రామాలకు సంధాన సదుపాయాన్ని పెంపొందింపచేయనుంది. ఈ గ్రామాల్లో సుమారు 19 లక్షల 74 వేల మంది జనాభా నివసిస్తున్నారు.

ఇవి బొగ్గు, సిమెంటు, క్లింకర్, జిప్సమ్, ఫ్లయ్ యాష్, కంటెయినర్లు, వ్యవసాయ ఉత్పత్తులతో పాటు పెట్రోలియమ్ ఉత్పత్తులు తదితర సరుకుల రవాణాకు అతి ప్రధాన మార్గాలుగా ఉన్నాయి. సామర్థ్యాన్ని పెంచేందుకు సంబంధించిన పనులను చేపట్టడం వల్ల ఒక్కో సంవత్సరంలోనూ అదనంగా 18.40 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) మేరకు సరకు రవాణా సాధ్యపడనుంది. రైల్వేలు పర్యావరణానుకూలమైన, ఇంధనం ఆదాకు దోహదం చేసే రవాణా మాధ్యమం అయిన కారణంగా, వాతావరణ సంబంధిత లక్ష్యాల సాధనలోనూ, దేశ రవాణా ఖర్చులను కనీస స్థాయికి పరిమితం చేయడంలోనూ తోడ్పడుతాయి. చమురు దిగుమతిని (20 కోట్ల లీటర్ల మేరకు) తగ్గిస్తాయి. అలాగే, కర్బన ఉద్గారాలను (అూ2 ఎమిషన్స్)ను కూడా కుదిస్తాయి (99 కోట్ల కిలోల మేరకు)... ఇది 4 కోట్ల మొక్కల పెంపకాన్ని చేపట్టడంతో సమానం.

ఈ ప్రాజెక్టులు నిర్మాణ కాలంలో దాదాపు 74 లక్షల పనిదినాలకు సరిపడ ప్రత్యక్ష ఉపాధిని కల్పించగలుగుతాయి.

ఇవి ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరిచి, వస్తు రవాణాకయ్యే వ్యయంతోపాటు చమురు దిగుమతులను తగ్గిస్తాయి. వాతావరణంలోకి కర్బన ఉద్గారాల స్థాయిని కుదించడంలోనూ తోడ్పడుతాయి. రైల్వే కార్యకలాపాలను దీర్ఘకాలం పాటు సమర్థంగా కొనసాగించడంలో మద్దతిస్తాయి. ఈ ప్రాజెక్టులు కీలక రూట్లలో కంటెయినర్లు, బొగ్గు, సిమెంటు, వ్యావసాయక ఉత్పత్తులు, ఇతర వస్తువుల రవాణాలో రైలు మార్గ సామర్థ్యాన్ని పెంపొందింపచేయడం ద్వారా రవాణా దక్షతను పెంచుతాయి. ఈ మెరుగుదలల వల్ల సరఫరా వ్యవస్థలను వీలైనంత ఎక్కువ స్థాయిలో వినియోగించుకోవడానికి, తద్వారా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసుకొనేందుకు మార్గం సుగమం అవుతుంది.

పెరిగే లైన్ కెపాసిటీ రాకపోకలను చెప్పుకోదగ్గ స్థాయిలకు చేరుస్తుంది. దీంతో భారతీయ రైల్వేల నిర్వహణ సామర్థ్యం మెరుగై, రైల్వేల సేవలపై ఆధారపడడంలో విశ్వసనీయత అధికమవుతుంది. ఈ మల్టి–ట్రాకింగ్ ప్రతిపాదనలు కార్యకలాపాలను సువ్యవస్థీకరించి, రద్దీని నివారించడానికి సహకరిస్తాయి. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ చెబుతున్న 'న్యూ ఇండియా' ('నవ భారత్') దృష్టికోణానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టులు ఉన్నాయి. ఒక ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తే, అక్కడి ప్రజలకు ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి కల్పన అవకాశాలు ఇనుమడించి, ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలను "ఆత్మనిర్భర్"గా (వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా) తీర్చిదిద్దాలన్నదే 'న్యూ ఇండియా' దార్శనికత ఉద్దేశం.

# గాంధీ భవన్‌లో ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మ దినోత్సవ వేడుకలు




హైదరాబాద్ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గాంధీ భవన్ లో కాంగ్రెస్ నాయకులు గజ్జెల కాంతం ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు జన్మ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న పార్టీ శ్రేణులు.

ఈ కార్యక్రమం లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్ రావ్, కార్యదర్శి అల్లం భాస్కర్, గజ్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలుమంత్రి శ్రీధర్ బాబు లాంగ్ లీవ్ అంటూ నేతల నినాదాలు చేసారు.

# పార్టీని కాపాడుకుకోవాలనేదే తన తపన

**-కార్యకర్తల ఆవేదననే లేఖలో ప్రస్తావించా... ఎమ్మెల్సీ కవిత**

హైదరాబాద్ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్;: బిఆర్ఎస్ పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడ్డానని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. పార్టీని కాపాడుకుకోవాలనేదే తన తపన అన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ..పదేళ్లుగా ఎంతో ఆవేదన అనుభవిస్తున్నానని, మాజీ సిఎం కెసిఆర్ కు లేఖ రాయడంలో తన తప్పు లేదని అన్నారు. కార్యకర్తల ఆవేదననే లేఖలో ప్రస్తావించానని పేర్కొన్నారు. లేఖను బయట పెట్టిన వారిని పట్టుకోవాలని సూచించారు. తనకంటూ సొంత జెండా, అజెండా లేదని చెప్పారు. కెసిఆర్ తప్ప మరో నాయకత్వాన్ని ఒప్పుకోనని, బిజెపిలో పార్టీ విలీనాన్ని తాను ఒప్పుకోనని కవిత తెలియజేశారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న ఏ పార్టీ బాగుపడలేదని, తాను జైల్లో ఉన్నప్పుడు బిజెపితో పొత్తు ప్రస్తావన ఆవేదన కలిగించిందని కవిత స్పష్టం చేశారు.

# 2025-26 లో సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కొనసాగింపునకు కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మే 30:2025–26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద వడ్డీ రాయితీ (ఐఎస్) కొనసాగింపునకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈరోజు ఆమోదం తెలిపింది. అందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకూ ఆమోదం తెలిపింది. కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) ద్వారా రైతులకు తక్కువ వడ్డీ రేట్లకే స్వల్పకాలిక రుణాన్ని అందించడానికి ఉద్దేశించిన కేంద్ర రంగ పథకం ఎంఐఎస్ఎస్.

ఈ పథకంలో భాగంగా:

– రైతులు కిసాన్ క్రెడిట్ కార్డుల (కేసీసీ) ద్వారా 7% సబ్సిడీ వడ్డీ రేటుతో రూ .3 లక్షల వరకు స్వల్పకాలిక రుణాలను పొందారు. అర్హత కలిగిన రుణ సంస్థలకు 1.5% వడ్డీ రాయితీని అందించారు.

–అంతేకాకుండా రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే రైతులకు 3% వరకు సకాలంలో చెల్లింపులపై ప్రోత్సాహకం (పీఆర్ఐ)గా లభిస్తుంది. దీంతో కేసీసీ రుణాలపై వడ్డీ రేటు 4 శాతానికి తగ్గుతుంది.

–పశుసంవర్ధకం లేదా చేపల పెంపకం కోసం ప్రత్యేకంగా తీసుకున్న రుణాలకు రూ. 2 లక్షల వరకు వడ్డీ రాయితీ వర్తిస్తుంది.

–ఈ పథకం రూపకల్పన లేదా ఇతర అంశాల్లో ఎలాంటి మార్పులనూ ప్రతిపాదించలేదు. దేశంలో 7.75 కోట్లకు పైగా కేసీసీ ఖాతాలున్నాయి. వ్యవసాయానికి సంస్థాగత రుణ లభ్యత దిశగా భరోసా అందించడంలో ఈ పథకాన్ని కొనసాగించడం కీలకమైన అంశం. ఉత్పాదకతను పెంచడంలోనూ చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సమ్మిళితత్వాన్ని అందించడంలోనూ ఇది అత్యంత కీలకమైనది.




# ఇ-కామర్స్ వేదికలపై వాకీ టాకీలు సహా రేడియో పరికరాల అక్రమ లిస్టింగ్, అమ్మకాల నిరోధం-నియంత్రణ కోసం నూతన మార్గదర్శకాలు-2025ను నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, మే 30:ఇ-కామర్స్ వేదికలపై వాకీ టాకీలు సహా రేడియో పరికరాల అక్రమ లిస్టింగ్స్, అమ్మకాల నిరోధం-నియంత్రణ కోసం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థ (సీసీపీఏ) నూతన మార్గదర్శకాలు-2025ను నోటిఫై చేసింది.

వినియోగదారుల భద్రతకు ముప్పు కలిగించే, చట్టపరమైన స్థితి గురించి వినియోగదారులను తప్పుదోవ పట్టించే, చట్టాల అమలు, అత్యవసర సేవల కోసం కీలకమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లలో ఉపయోగించే వైర్‌లెస్ పరికరాల అనధికార అమ్మకాలను అరికట్టడానికి ఈ మార్గదర్శకాలను నోటిఫై చేశారు.

టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీవోటీ), హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) లతో విస్తృతమైన సంప్రదింపుల అనంతరం ఈ మార్గదర్శకాలను ఖరారు చేశారు. సమన్వయంతో కూడిన, సమగ్రమైన విధానాన్ని రూపొందించడం కోసం ఈ రెండు విభాగాలు అందించిన కీలకమైన నియంత్రణ, భద్రతాపరమైన సూచనలను ఈ తుది మార్గదర్శకాల్లో చేర్చారు.

వైర్‌లెస్ ఆపరేటింగ్ లైసెన్స్ అవసరం గురించి.. వర్తించే చట్టాలకు అనుగుణంగా ఉండటం గురించి తప్పనిసరి అయిన, స్పష్టమైన వివరాలను వెల్లడించకుండా వాకీ-టాకీలను ఇ-కామర్స్ వేదికలపై విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వాకీ-టాకీల కోసం ఉత్పత్తి లిస్టింగ్స్‌లో ఆ పరికరాన్ని ఉపయోగించడానికి సంబంధిత అథారిటీ నుంచి లైసెన్స్ పొందాల్సిన అవసరాన్ని గురించి ఎలాంటి సమాచారం పేర్కొనలేదు. ఫ్రీక్వెన్సీ పరిధి, ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం-1885, వైర్‌లెస్ టెలిగ్రఫీ చట్టం-1933 కింద లైసెన్సింగ్ బాధ్యతలు, తక్కువ పవర్ ఉపయోగించుట, చాలా తక్కువ పవర్ గల షార్ట్ రేంజ్ రేడియో ఫ్రీక్వెన్సీ పరికరాల వాడకం (లైసెన్సింగ్ అవసరం నుంచి మినహాయింపు గలవి) నియమాలు-2018, అనధికార వినియోగం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాల వంటి వివరాలను ప్రదర్శించకపోవడం వల్ల వినియోగదారులు ఈ పరికరాలు సాధారణ ప్రజలు స్వేచ్ఛగా ఉపయోగించేవిగా భావించడం ద్వారా అవి దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది.

అనుమతించిన ఫ్రీక్వెన్సీల పరిధిలో పనిచేసే అధీకృత, చట్టబద్ధత గల వాకీ-టాకీ పరికరాలు మాత్రమే ఆన్‌లైన్ వేదికలపై అమ్మకం కోసం లిస్ట్ చేయాల్సి ఉంటుంది.

ఉత్పత్తి ఫ్రీక్వెన్సీ పరిధులను, ఇతర సాంకేతిక వివరాలను స్పష్టంగా పేర్కొనాలి, రెగ్యులేటరీ ఆమోదం (పరికర రకం ఆమోదం) రుజువును ఆ ఉత్పత్తి లిస్టింగ్స్ ప్రదర్శించాలి.

ఇ-కామర్స్ సంస్థలు ఇటువంటి ఉత్పత్తుల విషయంలో తగిన శ్రద్ధ వహించి, అవి నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, వర్తించే సందర్భాల్లో లైసెన్సింగ్ కలిగి ఉన్నాయా ధ్రువీకరించుకోవాలి. అలాగే ఫ్రీక్వెన్సీ సమాచారం, అవసరమైన సర్టిఫికేషన్స్ లేని ఉత్పత్తులను లిస్టింగ్ నుంచి తొలగించాలి.

అటువంటి పరికరాల చట్టబద్ధ వినియోగం గురించి వినియోగదారులకు తప్పుడు సమాచారం అందించే, వారిని తప్పుదోవ పట్టించే ప్రకటనలను, ఉత్పత్తి వివరణలను నిషేధించాలి.

అమ్మకం కోసం లిస్ట్ చేసిన పరికరాలు డీవోటీ కేటాయించిన, అధికారం కల్పించిన ఫ్రీక్వెన్సీ నుంచి మినహాయింపు పొందని ఫ్రీక్వెన్సీలపై పనిచేయడం లేదనీ, ఉత్పత్తి వివరణలో ఫ్రీక్వెన్సీ శ్రేణులను స్పష్టంగా లేబుల్ చేశారని విక్రేతలు నిర్ధారించుకోవాలి.

వినియోగదారుల భద్రత చట్టం-2019 అమలు విధానాలను, దాని ఉల్లంఘనలకు విధించే జరిమానాలను వివరంగా పేర్కొనాలి.

అటువంటి ఉత్పత్తులను లిస్ట్ చేయడానికి ముందే వేదికలు తగిన శ్రద్ధ వహించడం విక్రేత ఆధారాలు, సర్టిఫికేషన్స్ తప్పనిసరిగా ధ్రువీకరించుకోవడం అనధికార లిస్టింగ్స్ కోసం స్వయంచాలక పర్యవేక్షణ, తొలగింపు విధానాలను ప్రవేశపెట్టడం వివరాలను సరైన విధంగా వెల్లడించడం ద్వారా వినియోగదారుల అవగాహనను ప్రోత్సహించడం నిబంధనలను పాటించని సందర్భాల్లో జరిమానాలు విధించడం, వేదికలను బాధ్యులను చేయడం సరైన ఫ్రీక్వెన్సీని వెల్లడించకుండా, లైసెన్సింగ్ సమాచారం, పరికరాల రకం ఆమోదం (ఈటీఏ) ప్రదర్శించకుండా ఇ-కామర్స్ వేదికలపై వాకీ-టాకీలను లిస్ట్ చేయడం, విక్రయించడం ద్వారా వినియోగదారుల భద్రత చట్టం-2019ని ఉల్లంఘించిన 16,970 ఉత్పత్తి లిస్టింగ్స్ కోసం ప్రముఖ డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లకు కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థ (సీసీపీఏ) ఇప్పటికే పదమూడు నోటీసులు జారీ చేసింది. మార్గదర్శకాలను జారీ చేయడంతో పాటు, ఈ వేదికలపై నిరంతర పర్యవేక్షణ, పరిశీలన కొనసాగించనున్నారు.

# ఉగ్రవాదాన్ని వేళ్లతో సహా పెకలించేయడానికి ప్రతి ఒక్క పద్ధతినీ ఉపయోగించేందుకు భారత్ సంకోచించదన్న శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, మే 30:"ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య ఒక్కటే కాదు.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ముఖం పగిలిపోయేటట్టుగా భారత్ కొట్టిన దెబ్బ.. పాక్ గనక ఏ విధమైన దుర్మార్గ చర్యకో, లేదా అనైతిక చర్యకో ఒడిగడితే, ఆ దేశం ఈసారి భారతీయ నౌకాదళం పోరాట శక్తిని చవిచూసి దాని కోపాగ్నికి గురి కావలసివస్తుంది" అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆయన ఈ రోజు గోవా సముద్ర తీరానికి ఆవల 'ఐఎన్ఎస్ విక్రాంత్'ను సందర్శించి, ఆ విమాన వాహక నౌకలోని అధికారులను, నావికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఐఎన్ఎస్ విక్రాంత్ మన దేశంలో రూపుదిద్దిన తొలి విమానవాహక నౌక. 'ఆపరేషన్ సిందూర్'లో భారతీయ నౌకాదళం అందించిన "నిశ్శబ్ద సేవ"ను రక్షణ మంత్రి ప్రశంసించారు. శక్తిశాలి 'క్యారియర్ బ్యాటిల్ గ్రూపు' పాకిస్తానీ నౌకాదళం ముందడుగు వేయకుండా చూసిందని, ఇలా చేయకపోయి ఉండి ఉంటే పాక్ తత్పర్యవసానాలను ఎదుర్కోవలసి వచ్చేది అని ఆయన తెలిపారు. దురాగతాలకు పాల్పడేందుకు పాక్ తెగించిన పక్షంలో న్యూ ఢిల్లీ నాయకత్వం తీసుకొనే ప్రతి చర్య తాలూకు పగ్గాల్నిక భారతీయ నౌకాదళం అందుకొంటుంది అంటూ ఆయన ఒక సుస్పష్ట సందేశాన్నిచ్చారు.

స్వాతంత్ర్యం వచ్చింది మొదలు పాకిస్తాన్ తాను ఆడుతున్న ఉగ్రవాదమనే ప్రమాదకరమైన ఆటకు ఇక కాలం చెల్లిందని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "ఇకమీదట, భారత్‌కు వ్యతిరేకంగా ఏదైనా ఉగ్రవాద చేష్టను పాకిస్తాన్ ఉసిగొల్పినట్లయితే, పర్యవసానాల్ని ఆ దేశం భరించడమే కాకుండా ఓటమిని కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. భారత్ వెనుకాడబోదు. ఉగ్రవాదమనే ముప్పును వేళ్లతో సహా పెకలించివేయడానికి అన్ని పద్ధతులనూ ఇండియా ఉపయోగించుకొంటుంది" అని ఆయన కరాఖండీగా చెప్పారు.

పాకిస్తానీ గడ్డ మీద నుంచి భారత్-వ్యతిరేక కార్యకలాపాలు బాహాటంగా జరుగుతున్నాయని, సరిహద్దులో రెండు వైపులా, సముద్రంలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రతి ఒక్క తీరులోనూ ఆపరేషన్ చేపట్టడానికి భారత్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని రక్షణ మంత్రి అన్నారు. ఇవాళ, భారత్‌కు ఉగ్రవాదం బారి నుంచి తన పౌరులను రక్షించుకొనే హక్కు ఉంది అని ప్రపంచం అంగీకారాన్ని తెలియజేస్తోంది అని ఆయన అన్నారు. పాకిస్తాన్ తన గడ్డ మీద పెరుగుతున్న ఉగ్రవాద మొక్కలను- తన సొంత చేతుల తోనే- వేళ్లతో సహా పెరికివేయాలి అని ఆయన ఉద్ఘాటించారు.

హాఫీజ్ సయీద్, మసూద్ అజహర్ వంటి ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కోరారు. "వాళ్లిద్దరూ భారతదేశ ''మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల' జాబితాలో ఉండటం ఒక్కటే కాదు, వాళ్లు యుఎన్ డిజిగ్నేటెడ్ టెర్రరిస్టులుగా కూడా. ముంబయి దాడుల నిందితుల్లో ఒకరైన తహవ్వుర్ రాణాను ఇటీవలే ఇండియాకు తీసుకు వచ్చాం. హఫీజ్ సయీద్ కూడా మంబయి దాడులలో అపరాధిగా ఉన్నాడు, అతడు చేసిన నేరానికి న్యాయ నిర్ణయం జరగాల్సిందే" అని మంత్రి అన్నారు.

చర్చల కోసం పాకిస్తాన్ పదే పదే సంసిద్ధతను వ్యక్తం చేస్తుండడంపై రక్షణ మంత్రి మరోసారి స్పష్టం చేస్తూ, "చర్చలంటూ జరిగితే, అవి కేవలం ఉగ్రవాదంతోపాటు పీఓకేపైనే జరగాలి. చర్చలపై పాకిస్తాన్ చిత్తశుద్ధితో ఉందంటే గనక హఫీజ్ సయీద్, మసూద్ అజహర్ వంటి ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాలి, అలా అయితేనే న్యాయం దక్కుతుంది" అన్నారు.

సమగ్ర ఆపరేషన్‌లో భారతీయ నౌకాదళం పోషించిన పాత్ర ప్రశంసాయోగ్యంగా ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వర్ణించారు. భారతీయ వైమానిక దళం పాకిస్తానీ గడ్డ మీది ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేస్తూ ఉన్న వేళ.. నౌకాదళం అరేబియా సముద్రంలో ఆక్రమణకారక మోహరింపుతోనూ, సముద్ర రంగం పట్ల తనకున్న సాటి లేని జాగృతి, ఆధిపత్య వైఖరులతోనూ పాకిస్తానీ నౌకాదళాన్ని దాని సొంత తీరప్రాంతానికే పరిమితమై ఉండేటట్టు చేసిందన్నారు. "మన పశ్చిమ ప్రాంత యుద్ధ నౌకలు సముద్రంలో మోహరించి- పహల్‌గామ్ ఉగ్రవాద దాడి జరిగిన 96 గంటల లోపే- పశ్చిమ, తూర్పు కోస్తా తీరప్రాంతాల్లో ఉపరితలం మీది నుంచి ఉపరితలానికి, ఉపరితలం మీది నుంచి నింగిలోకి క్షిపణులను, నౌకా విధ్వంసక ఆయుధాలను విజయవంతంగా ప్రయోగించాయి. ఇది మన ప్లాట్‌ఫారాలు, సిస్టమ్స్, సిబ్బంది సమర సన్నద్ధతతో పాటు మన ఉద్దేశాన్ని, అప్రమత్తతను కూడా తెలియజెప్పి, శత్రువు రక్షణాత్మకంగా వ్యవహరించక తప్పని స్థితిని కల్పించింది" అని ఆయన అన్నారు.

'క్యారియర్ బ్యాటిల్ గ్రూపు' బల ప్రదర్శన భారత్ ఉద్దేశాన్ని, సత్తాను సమర్థంగా తెలియజెప్పిందని కూడా రక్షణ శాఖ మంత్రి వ్యాఖ్యానించారు. భారతీయ నౌకాదళానికున్న భీకర శక్తి, సైనిక చతురత, విధ్వంసక సామర్థ్యాలు శత్రువు నైతిక స్థితిని దెబ్బ తీశాయని ఆయన అన్నారు. నౌకాదళం తన సన్నాహక చర్యలలో ఎంతమాత్రం వెనుదీయకుండా వ్యవహరిస్తూ ఉండాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు. భరత భూమి పైన ఏదైనా ఉగ్రవాద దాడి జరిగిందా అంటే గనక దానిని ఒక 'యుద్ధ చేష్ట'గా పరిగణిస్తామని, అదే విధంగా ప్రతిస్పందిస్తామంటూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిన సంగతిని మంత్రి పునరుద్ఘాటించారు.

ఆపరేషన్ సిందూర్ ఇంతటితో ముగియలేదు, ఇది కేవలం విరామం.. ఇదొక హెచ్చరిక అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. పాకిస్తాన్ అదే పొరపాటును పునరావృత్తం చేస్తే, భారత్ ఇచ్చే జవాబు మరింత కఠినంగా ఉంటుంది అని కూడా ఆయన అన్నారు.

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా కనబరచిన వేగాన్ని, తీవ్రతను, స్పష్టతను రక్షణ మంత్రి ప్రశంసిస్తూ, కచ్చితత్వంతో చేసిన దాడులు త్రివిధ దళాల నడుమ పటిష్ట సహకారాన్నే కాకుండా మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని కూడా చాటిచెప్పాయి అన్నారు. ఈ ఆపరేషన్.. భారత్ ఇక ఎంతమాత్రం సహనాన్ని ప్రదర్శించదని, దీటైన జవాబిస్తుందని ఉగ్రవాదులకు, ఉగ్రవాదులకు కొమ్ముకాసే శక్తులకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపింది అని ఆయన అన్నారు. "చాలా కొద్ది కాలంలో, మనం పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాన్ని, దాని ఉద్దేశాల్ని తునాతునకలు చేసేశాం. మన ప్రతిస్పందన ఎంత బలంగా ఉందంటే పాకిస్తాన్ ఇక ఆపేయండంటూ అభ్యర్థించింది. మనం మన సొంత షరతులతోనే మన సైనిక చర్యలను ఆపాం. మన బలగాలు వాటి శక్తిసామర్థ్యాల్ని ప్రదర్శించడాన్నింకా మొదలుపెట్టనే లేదు సుమా" అని ఆయన అన్నారు.

సైన్యం, వైమానిక దళం.. ఈ రెండిటి సిబ్బందితోనూ, నౌకాదళ యోధులతోనూ ఆపరేషన్ సిందూర్ అనంతర కాలంలో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తాను జరిపిన సమావేశాలపై వ్యాఖ్యానిస్తూ నేల, నింగి, సముద్రం.. ఈ మూడిటిలో దేనిలోనైనా ఎలాంటి స్థితినైనా ఎదుర్కోవడానికి భారత్ సర్వసన్నద్ధంగా ఉందంటూ సంత?ప్తిని వ్యక్తం చేశారు. గోవా విముక్తి వేళ ఐఎన్ఎస్ విక్రాంత్ పాత వెర్షన్ అందించిన సేవలను ఆయన గుర్తుకు తెచ్చారు. ఆ విమాన వాహక నౌక 1961లో యుద్ధ కార్యకలాపాల్లో భారతీయ నౌకాదళ ఓడల గుంపునకు సారథ్యం వహించిందని, మరి ఇప్పుడు, దీని కొత్త స్వదేశీ రూపు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మన దేశ దృఢసంకల్పానికి వెన్నుదన్నుగా నిలుస్తోందని మంత్రి అన్నారు.

రక్షణ మంత్రి తన ప్రసంగం చివర్లో ''ఈ రోజు, మనం తుపాకిగుళ్లు, బాంబులతోనే యుద్ధాలు చేసే కాలంలో లేం, సైబర్ జగతిలో, సమాచార ఆధిపత్యం, వ్యూహాత్మక నిరోధం ద్వారా కూడా యుద్ధాలు జరుగుతున్న కాలంలో ఉన్నాం. ఈ రంగాల్లో నౌకాదళం ముందుకు సాగుతూ ఉండడం గర్వకారణం" అన్నారు. భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్రానికి కాపలాదారుగా మాత్రమే కాక, ఈ ప్రాంతంలో మన దేశం ఉనికిని బలోపేతం చేస్తున్న వ్యూహాత్మక శక్తిగా కూడా ఉంది. ఇది భారత్ కేవలం ఒక ప్రాంతీయ శక్తి ఎంతమాత్రం కాదు, ఇది ప్రపంచ శక్తిగా మారే దిశగా పయనిస్తోందని శత్రువును హెచ్చరిస్తోంది' అని ఆయన అభివర్ణించారు.

శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఐఎన్ఎస్ విక్రాంత్ వద్దకు వచ్చినప్పుడు ఆయన వెంట నౌకా దళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠీ, పశ్చిమ నౌకాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ జే సింగ్‌లతో పాటు భారతీయ నౌకాదళానికి చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు.

రక్షణ మంత్రి గురువారం (మే 29న) గోవాకు చేరుకొని, ఆపరేషన్ సిందూర్ తొలి దశలో పాలుపంచుకొన్న భారతీయ నౌకాదళ సిబ్బందితో సమావేశమయ్యారు. ఐఎన్ఎస్ విక్రాంత్ ఒక్కటే కాకుండా, అవతలి సేనతో తలపడిన ఇతర కీలక యుద్ధనౌకలను కూడా సందర్శించారు. ఆ నౌకలు క్యారియర్ బ్యాటిల్ గ్రూపులో భాగంగా ఉండి, పాకిస్తానీ నౌకాదళానికి చెందిన యూనిట్లు మక్రాన్ కోస్తాతీరానికి సమీపంలోనే ఉండిపోక తప్పని స్థితిని కల్పించడంలో కీలక పాత్రను పోషించాయి. శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఐఎన్ఎస్ హంసకు వచ్చిన సందర్భంగా, ఆయనకు గౌరవ వందనాన్ని సమర్పించారు. ఆ తరువాత, సముద్ర తలంలో కార్యకలాపాల పురోగతి వివరాలతో పాటు వివిధ విభాగాలు సమగ్ర సన్నద్ధత వివరాలను కూడా ఆయనకు నివేదించారు.

# పేదల వైద్య సేవలకు సహకారం : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



హైదరాబాద్, మే 30: పేదల వైద్య సేవలకు సహకారం అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన లాలాగూడ నివాసి వసంత, తుకారం గేట్ నివాసి మణెమ్మలు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఎమ్మెల్యేకు సమాచారం అందింది. ఈ క్రమంలో వారికి రూ. మూడు లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సీ) పత్రాలను, చెక్కులను సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందించారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నిరుపేదలు వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు.

ప్రజలు అత్యవసర సందర్భాల్లో సీతాఫల్‌మండిలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో రోగులు చికిత్స పొందేందుకు వీలుగా ఈ పత్రాలను అందించామని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు.

# ఇబ్బందుల్లేకుండా రేషన్ బియ్యం అందించాలి.. డీలర్లకు అదనపు కలెక్టర్ ఆదేశాలు

హైదరాబాద్, మే 30:సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా రేషన్ బియ్యం అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. రేషన్ షాపుల్లో మూడు నెలలకు సరిపడే సన్నబియ్యం ఒకేసారి పంపిణీపై రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారులకు వచ్చే నెల 1వ తేదీ నుంచి జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు సరిపడా సన్నబియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, డీలర్లను ఆదేశించారు. రేషన్ షాపులు ఉదయం, సాయంత్రం తప్పక సమయపాలన పాటించాలని సూచించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, ఇతర వసతులను కల్పించాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని, సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# ఎన్జీవో కార్యాలయంలో చోరీ.. యువకుడు అరెస్ట్, గాడ్జెట్‌లు స్వాధీనం

న్యూఢిల్లీ, మే 30:ఒక ఎన్జీవో కార్యా లయంలో దొంగతనం జరిగింది. (ఎబీతీణశ్రీజీతీఎ జీబి జీని ఔఊా నీటటతిఇఎవ) మొబైల్ ఫోన్స్, ట్యాబ్స్ వంటి పలు గాడ్జెట్‌లు చోరీ అయ్యాయి. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరకు నిందితుడైన 19 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. కొన్ని గాడ్జెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. మే 13న జనక్‌పురిలోని జనక్ సినిమా కాంప్లెక్స్‌లో ఉన్న 'ప్రొత్సాహన్ ఇండియా ఫౌండేషన్' కార్యాలయంలో దొంగతనం జరిగింది. ఆ రోజు ఉదయం ఆఫీస్‌కు వచ్చిన సిబ్బంది విండో పగిలి ఉండటాన్ని గమనించారు. మూడు మొబైల్ ఫోన్లు, 12 ట్యాబ్స్, లాప్‌టాప్ ఛార్జర్‌తో సహా పలు ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీ అయ్యాయని గ్రహించారు. దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాగా, పోలీసులు ఈ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పలు సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. మహావీర్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న 19 ఏళ్ల రోహన్ అలియాస్ ఖంకాను నిందితుడిగా గుర్తించారు. అతడి ఇంట్లో పోలీసులు తనిఖీ చేశారు. ఒక మొబైల్ ఫోన్, 11 ట్యాబ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితోపాటు స్వాధీనం చేసుకున్న గాడ్జెట్‌లను శుక్రవారం ప్రదర్శించారు. మిగతా వాటిని రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# శ్రీపురం రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్, మే 30:నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురంలోని అత్యంత పురాతన శ్రీరంగనాయకస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 4నుంచి 7 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్రహ్మోత్సవ వేడుకల కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

ధర్మకర్త రంగాచార్యులు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జూన్ 4న అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యా వచనం, రక్షా బంధనం, అంకురార్పణ, 5న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం, 6న ఉదయం శ్రీ గోదా రంగనాయకస్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 7న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశరాధన, ధ్వజారోహణం, కుంభ ప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, వినోదాచార్యులు, గంధం ప్రసాద్, చంద్రనారాయణ, వరదయ్య, దురెడ్డి రవీందర్ రెడ్డి, మారం మాధవ్ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, మల్లికార్జున్, టీవీ రవి తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో తొలిసారి.. ఎన్డీయే నుంచి 17 మంది మహిళా క్యాడెట్స్ పాస్‌అవుట్



ముంబై, మే 30: మహారాష్ట్ర పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీయే) చరిత్ర సృష్టించింది. తొలి బ్యాచ్‌కు చెందిన 17 మంది మహిళా క్యాడెట్స్ పట్టభద్రులయ్యారు. శుక్రవారం జరిగిన పాస్‌అవుట్ పరేడ్‌లో 300 మందికి పైగా పురుష క్యాడెట్లతో కలిసి వీరు పాల్గొన్నారు. త్రివిధ దళాల్లో అధికారులుగా సేవలందించనున్నారు.

కాగా, మిజోరాం గవర్నర్, మాజీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సీవోఏఎస్) జనరల్ విజయ్ కుమార్ సింగ్ (రిటైర్డ్) పాసింగ్ అవుట్ పరేడ్‌కు సమీక్షా అధికారిగా వ్యవహరించారు. ఇది చాలా ముఖ్యమైన, చారిత్రాత్మకమై పాస్‌అవుట్ పరేడ్ అని ఆయన అభివర్ణించారు. తొలి బ్యాచ్‌కు చెందిన 17 మంది మహిళా క్యాడెట్ల విజయాన్ని ప్రశంసించారు. 'ఈ రోజు అకాడమీ చరిత్రలో ఒక ప్రత్యేకమైన ముఖ్యమైన రోజు. ఎన్డీయే నుంచి మొదటి బ్యాచ్ మహిళా క్యాడెట్లు బయటకు వచ్చారు. మహిళా సాధికారత, సమిష్టి ప్రయాణంలో చారిత్రాత్మక మైలురాయిని ఇది సూచిస్తుంది' అని అన్నారు.

మరోవైపు మహిళా అభ్యర్థులకు డిఫెన్స్ అకాడమీ తలుపులు తెరవడానికి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కు సుప్రీంకోర్టు అనుమతించింది. 2021లో ఈ మేరకు చారిత్రక ఆదేశాన్ని జారీ చేసింది. దీంతో 2022లో మహిళా క్యాడెట్‌ల మొదటి బ్యాచ్ ఎన్డీయే 148వ కోర్సులో చేరారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన మహిళా క్యాడెట్స్ పురుషులతో సమానంగా త్రివిధ దళాధికారులుగా దేశానికి సేవలందించనున్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చూడాలి : ఎమ్మెల్యే బాలునాయక్



నల్గొండ, మే 30: దేవరకొండ నియోజవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో గల దొంతినేని సంపత్ అమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారుపాకుల అరుణా సురేశ్‌గౌడ్, కొండభీమనపల్లి మాజీ సర్పంచ్ మునుకుంట్ల విద్యావతి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంతోనే ప్రతి ఒక్కరికీ న్యాయం

## -మంత్రి కొండా సురేఖ

## -వరంగల్ లో ప్రజా సమస్యలు పరిష్కరించిన మంత్రి



వరంగల్ మే 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్)కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, బడుగు, బలహీన వర్గాల జీవితాలలో వెలుగు నింపడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం ఆమె హన్మకొండ రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు హన్మకొండలోని తమ నివాసానికి చేరుకొని సమస్యలు మంత్రి సురేఖకి విన్నవించారు. ప్రతి సమస్య వింటూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతూ మంత్రి సురేఖ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ..ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ.. పేదల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నిరుపేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనుఇస్తూ పాలన సాగిస్తున్నామన్నారు. అభివృద్ధి జోడెద్దుల ముందుకు ఇందిరమ్మ ప్రభుత్వంలో సంక్షేమం, సాగుతున్నాయని తెలిపారు.

# 'మల్లేశం'కు గద్దర్ అవార్డుపై చింతకింది మల్లేశం హర్షం

నల్గొండ, మే 30:చేనేత కార్మికుల బతుకులను కండ్లకు కట్టినట్లుగా తెరకెక్కిన చిత్రం మల్లేశం. ఈ మూవీ 2019 గద్దర్ అవార్డుల విజేతల్లో మూడవ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. దీనిపై పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం హర్షం వ్యక్తం చేశారు.

శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మల్లేశం సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, నిర్మాతగా వ్యవహరించిన రాజు రాచకొండకు, నటీ, నటులు ప్రియదర్శి, అనన్య, సినిమా నిర్మాణంలో పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తన తల్లి ఆసు పోయడానికి పడుతున్న బాధను చూసి చెల్లించిపోయిన చింతకింది మల్లేశం ఏడు సంవత్సరాలు కష్టపడి ఆసు యంత్రాన్ని తయారు చేశారు. తన కృషికి గాను అబ్దుల్ కలాం అవార్డు, పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. ఎన్నో ఇన్నోవేషన్స్ లో పాల్గొని చేనేత రంగానికి సులభమైన పద్ధతిలో యంత్రాన్ని తయారుచేసి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తం మల్లేశం.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.